1 St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 3 సంచిక : 77 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 22 మార్చి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు

VOLUME : 03 ISSUE : 77 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Sunday 22 March 2026 PAGES : 8 PRICE : 3/-

## లక్ష ఉద్యోగాలతో ఏపీలో
# అతిపెద్ద స్టీల్ ప్లాంట్...
## శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 21)

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో మరో భారీ ముందడుగు పడుతోంది. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు గత 21 నెలలుగా కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రపంచ ప్రఖ్యాత ఉక్కు ఉత్పాదక సంస్థ ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా (ఏఎంఎన్ఎస్ ఇండియా), రాష్ట్రంలో అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధమైంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఈనెల 23వ తేదీన (సోమవారం) ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులతో కలిసి భూమిపూజ చేయనున్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రాన్నే మార్చగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**లక్ష ఉద్యోగాలతో భారీ ప్రాజెక్టు**

సుమారు రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో 5,465 ఎకరాల విస్తీర్ణంలో ఈ స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరగనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మొత్తం రెండు దశల్లో ఈ ప్రాజెక్టును పూర్తి చేయనున్నారు. తొలిదశలో 7.3 మిలియన్ మెట్రిక్ టన్నులు, ▶మిగతా 2లో

## ఇరాన్ ఐక్యతను తక్కువగా అంచనావేశారు

**అమెరికా, ఇజ్రాయెల్‌పై మొజ్తాబా విమర్శలు**

**దుబాయ్: అమెరికా, ఇజ్రాయెల్‌తో భీకర యుద్ధం సాగుతున్న వేళ**



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 21)

ఇరాన్ అగ్రనేత మొజ్తాబా ఖమేనీ శుక్రవారం ఒక లిఖితపూర్వక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యర్థులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. పర్షియన్ కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని విడుదల చేసిన ఈ లేఖను ఇరాన్ టీవీలో చదివి వినిపించారు. మూడువారాల పోరులో ఇరాన్‌వాసులు దృఢ సంకల్పాన్ని ప్రదర్శించారని ఖమేనీ కొనియాడారు. అగ్రనేతలను చంపేస్తే ఇరాన్‌లో ప్రభుత్వాన్ని కూలదోయవచ్చన్న భ్రమతో అమెరికా, ఇజ్రాయెల్‌లు ఈ యుద్ధానికి దిగాయన్నారు. "పోరు ఆరంభమైన రెండు రోజుల్లోనే ఇరాన్ ప్రజలు ప్రభుత్వాన్ని పడగొడతారని ప్రత్యర్థులు లెక్కలు కట్టారు. అయితే జాతి ఐక్యతను వారు తక్కువగా అంచనావేశారు" అని పేర్కొన్నారు.

శత్రువులను ఎదుర్కొనేందుకు ఇరాన్‌వాసులు దేశవ్యాప్తంగా గట్టి రక్షణ ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. ప్రత్యర్థులను గట్టిగా దెబ్బతీస్తున్నారని ఖమేనీ ప్రశంసించారు. దీంతో దిక్కుతోచని స్థితిలో శత్రు పక్షాలు అసంబద్ధ ప్రకటనలు చేస్తున్నాయన్నారు. పొరుగు దేశాలతో సంబంధాలనూ ఆయన ప్రస్తావించారు. దాడుల్లో మరణించిన తన తండ్రి ఆయతుల్లా అలీ ఖమేనీకి పాకిస్థాన్ అంటే ఎంతో ఇష్టమన్నారు. పాక్, అఫ్గానిస్థాన్‌ల మధ్య సత్సంబంధాలు నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ దిశగా తన వంతు ప్రయత్నాలకు తాను సిద్ధమన్నారు. "తాజా యుద్ధంలో తుర్కియే, ఒమన్‌లపై దాడులు జరిగాయి. ఆ రెండు దేశాలకు మాతో సత్సంబంధాలు ఉన్నాయి. ఆ దేశాల్లోని కొన్ని ప్రాంతాలపై దాడులు చేసింది ఇరాన్ కాదు. పొరుగు దేశాలతో మా సంబంధాలను చెడగొట్టడానికి ఇజ్రాయెల్ ఎత్తుగడలు వేస్తోంది" అని ఆయన ఆరోపించారు. తండ్రి స్థానంలో సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మోజ్తాబా ఖమేనీ బహిరంగ ప్రదేశాల్లో కనిపించలేదు. తమ దాడుల్లో ఆయన గాయపడ్డారని ఇజ్రాయెల్, అమెరికా దళాలు చెబుతున్నాయి.

## ఆధునిక యుద్ధం..సరిహద్దులు దాటింది: రాజ్‌నాథ్ సింగ్




(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 21)

నేటి రోజుల్లో యుద్ధం అంటే కేవలం సరిహద్దుల్లో జరిగే ఘర్షణ మాత్రమే కాదని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం యుద్ధం సరిహద్దులను దాటిందని.. ఆర్థిక, డిజిటల్, ఇంధన, ఆహార భద్రతలు కూడా జాతీయ భద్రతలో భాగమయ్యాయని అన్నారు. వాటి ద్వారా ఒక దేశం మరో దేశాన్ని బలహీనపరిచే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ప్రతి పౌరుడు అన్ని వేళలా దేశ రక్షణ కోసం సన్నద్ధమై ఉండాలని ▶మిగతా 2లో

## స్వార్థం, ఆధిపత్య ఆకాంక్షలే యుద్ధానికి కారణం


(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 21)

స్వార్థ ప్రయోజనాలు, ఆధిపత్య ఆకాంక్షలే ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఘర్షణలకు ప్రధాన కారణమని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధినేత మోహన్ భాగవత్ పేర్కొన్నారు. ఐక్యత,



క్రమశిక్షణ, ధర్మాచరణ ద్వారానే శాశ్వత శాంతి సాధ్యమవుతుందని ఆయన ఉద్ఘాటించారు. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో శుక్రవారం విదర్భ ప్రాంత విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) కార్యాలయానికి భూమిపూజ చేసిన అనంతరం ఆయన సభలో ప్రసంగించారు. 2 వేల ఏళ్లుగా ప్రపంచం వివిధ మార్గాలను ప్రయత్నించినా ఘర్షణలకు పరిష్కారం దొరకలేదన్నారు. శాంతియుత జీవనానికి సామరస్యం, సహకారమే మార్గమని ఆయన సూచించారు.

## ఇంధన వనరులపై దాడుల్ని ఖండించిన మోదీ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 21)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఈసా అల్ ఖలీఫాతో మాట్లాడారు. పశ్చిమాసియా పరిస్థితులపై ఇరువురు నేతలూ చర్చించుకున్నారు. కల్లోలిత పశ్చిమాసియా ప్రాంతంలో ఇంధన వనరులపై, మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులను మోదీ ఈ సందర్భంగా ఖండించారు. నౌకల రాకపోకలు స్వేచ్ఛగా సాగాల్సిన అవసరాన్ని, నౌకాయానానికి భద్రత కల్పించాల్సిన ఆవశ్యకతను ▶మిగతా 2లో

## తితిదే ఆలయాలను అధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 21)

తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) పరిధిలోని ఆలయాలను అత్యంత అధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తితిదే బోర్డు సభ్యులకు సూచించారు. తిరుమలలో పర్యటించిన సీఎం.. శనివారం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బోర్డు సభ్యులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తిరుమలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్నారు. ముందస్తుగానే సమస్యలను ▶మిగతా 2లో

## ఇరాన్ అధ్యక్షుడికి మరోసారి ప్రధాని మోదీ ఫోన్.. పశ్చిమాసియా యుద్ధంపై కీలక చర్చ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 21)

పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు, యుద్ధ వాతావరణం ఉగ్రరూపం దాల్చుతున్న తరుణంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెష్కియన్‌తో మరోసారి ఫోన్‌లో సంభాషించారు. శనివారం జరిగిన ఈ ఫోన్ కాల్‌లో మోదీ ఇరాన్ ప్రజలకు ఈద్, నౌరూజ్ (పర్షియన్ నూతన సంవత్సరం) పండుగల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇరువురు నేతలు ప్రాంతీయ భద్రత, స్థిరత్వంపై కీలక అంశాలను చర్చించుకున్నారు. ఇజ్రాయెల్, అమెరికాతో ఇరాన్ ఘర్షణ పూరిత వాతావరణంలో ఉన్న నేపథ్యంలో ఈ సంభాషణకు దౌత్యపరంగా ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సంభాషణ వివరాలను ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతా ద్వారా పంచుకున్నారు. "ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెష్కియన్‌తో మాట్లాడాను. ఈద్, నౌరూజ్ శుభాకాంక్షలు తెలియజేశాను. ఈ పండుగల సమయం పశ్చిమాసియాకు శాంతి, స్థిరత్వం, శ్రేయస్సును తీసుకురావాలని ఆకాంక్షించాం" అని మోదీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పండుగ వాతావరణంలో శాంతియుత వాతావరణం నెలకొనాలని ఇరువురు నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చర్చల సందర్భంగా, పశ్చిమాసియాలోని కీలక మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులను ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడులు ప్రాంతీయ స్థిరత్వానికే కాకుండా, ప్రపంచ సరఫరా గొలుసులకు కూడా తీవ్ర అంతరాయం కలిగిస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, ▶మిగతా 2లో

## పీఎస్‌యూ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 62కి పెంపు.. సానుకూలంగా ప్రభుత్వం!

(షణ్ముఖ వెలుగు, అమరావతి, మార్చి 21)

ఏపీలోని ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూ), గురుకుల సొసైటీ పాఠశాలల ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. వీరి పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచే ప్రతిపాదనకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

ఈ అంశంపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ▶మిగతా 2లో

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్.. పేద ముస్లిం కుటుంబానికి కొత్త ఇల్లు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 21)

మంగళగిరిలో ఓ పేద ముస్లిం కుటుంబానికి ఇచ్చిన మాటను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిలబెట్టుకున్నారు. గతేడాది పవిత్ర రంజాన్ మాసంలో చేసిన వాగ్దానాన్ని ఏడాది తిరగకముందే నెరవేర్చి, వారికి కొత్త ఇంటిని నిర్మించి ఇచ్చారు.

వివరాల్లోకి వెళితే... గతేడాది రంజాన్ మాసం సందర్భంగా మంత్రి లోకేశ్ మంగళగిరి బస్టాండ్ సమీపంలో నివసించే షేక్ షహెన్నా నివాసానికి ఆకస్మికంగా వెళ్లారు. అక్కడ షహెన్నా కుటుంబ సభ్యులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారి శిథిలావస్థలో ఉన్న రేకుల ఇంటిని మంత్రి పరిశీలించారు. తమ పూర్వీకులు నిర్మించిన ఆ ఇంటి స్థానంలో కొత్త ఇల్లు కట్టించి ఆదుకోవాలని షహెన్నా కుటుంబ సభ్యులు మంత్రిని కోరారు.

వారి అభ్యర్థనకు స్పందించిన లోకేశ్, ఆ కుటుంబ బాధ్యతను తాను తీసుకుంటానని, కొత్త ఇల్లు నిర్మించి ఇస్తానని అక్కడికక్కడే హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఏడాది పూర్తి కాకముందే షహెన్నా కుటుంబానికి నూతన గృహాన్ని నిర్మించి ఇచ్చారు. పవిత్ర రంజాన్ మాసంలో ఇచ్చిన హామీని మళ్లీ అదే రంజాన్ మాసం వచ్చేసరికి నెరవేర్చడం గమనార్హం.

## ఎమ్మెల్యే ఏలూరి కృషితో మండల రహదారులకు మహర్దశ

పోద వీరయ్య

రూ.37 లక్షల సిమెంటు రోడ్డుకు శంకుస్థాపన



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మార్చి 21)

కూటమి పాలనలో ఎమ్మెల్యే ఏలూరి సంబశివరావు కృషి తో మండలంలోని గుంతలతో నిండిన రహదారులకు, అస్తవ్యస్తంగా దెబ్బతిని ప్రయాణ సౌలభ్యం లేని రోడ్లకు మహర్దశ ప్రారంభమైందని పోద వీరయ్య అన్నారు. శనివారం మండలంలోని చిన్నగంజాం పంచాయతీ ఏరియాలోని మహాలక్ష్మి కాలనీ నందు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నిరంతర కృషి ఫలితంగా మంజురైన 37 లక్షల విలువ కల సిమెంట్ రోడ్లు కు కూటమి నాయకులు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా పార్టీ అధ్యక్షులు పోద వీరయ్య, పర్వతరెడ్డి సత్యనారాయణ, తుమ్మలపెంట జయరావు, చేవూరి రమణమ్మ, నరహరి శ్రీనివాసరావు, సందు శ్రీనివాసరావు, మోటుమర్రి రామసుబ్బారావు, గంటా వెంకటనారాయణ, ఏసు నారాయణ, పర్వత రెడ్డి పార్థసారథి, భయ్యాసతీష్ కుమార్, కోట శివరామకృష్ణ, మహాలక్ష్మి కాలనీ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఉన్నం భాస్కరరావుకు ఎమ్మెల్యే ఇంటూరి పరామర్శ



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మార్చి 21)

బిజెపి నాయకులు, ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల అధినేత ఉన్నం భాస్కరరావు తండ్రి ఆదిశేషయ్య ఇటీవల మరణించగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కందుకూరు విక్కిరాలపేటరోడ్డులోని భాస్కరరావు ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టిడిపి నాయకులు మర్రిపూడి శ్రీను, అల్లం వెంకటేశ్వర్లు, రావూరి రామకోటయ్య, బెజవాడ ప్రసాద్, మాదాల నరసింగరావు తదితరులు ఉన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

### లక్ష ఉద్యోగాలతో ఏపీలో

## అతిపెద్ద స్టీల్ ప్లాంట్...

### శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు

రెండో దశలో 10.5 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే, ఈ ప్లాంట్ ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేస్తుంది. దేశీయంగా పెరుగుతున్న ఉక్కు డిమాండ్‌ను అందుకోవడంలో ఈ ప్లాంట్ కీలక పాత్ర పోషించనుంది.

**అనుబంధంగా క్యాప్టివ్ పోర్టు.. మరో 6,000 ఉద్యోగాలు**

ఈ భారీ స్టీల్ ప్లాంట్‌కు అనుబంధంగా ఏఎంఎన్ఎస్ ఇండియా సంస్థ ప్రత్యేకంగా ఒక క్యాప్టివ్ పోర్టును కూడా నిర్మించనుంది. ఇందుకోసం అదనంగా రూ.11,198 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 316 ఎకరాల్లో 50 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఈ పోర్టును అభివృద్ధి చేస్తారు. ఈ పోర్టు నిర్మాణం ద్వారా మరో 6,000 మందికి ఉపాధి లభించనుంది. ఈ స్టీల్ ప్లాంట్, క్యాప్టివ్ పోర్టు రాకతో విశాఖ ఎకనమిక్ రీజియన్ ఒక ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా (హబ్) రూపాంతరం చెందనుంది.

**ప్రభుత్వం సంపూర్ణ సహకారం**

ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోంది. పరిశ్రమకు అవసరమైన నీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను శరవేగంగా కల్పిస్తోంది. ప్లాంట్‌ను జాతీయ రహదారి-16తో అనుసంధానించేందుకు 4 లేన్ల రహదారి విస్తరణ పనులను కూడా ప్రభుత్వం చేపట్టింది.

**సీఎం పర్యటన వివరాలు**

సోమవారం జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఆయన అమరావతి నుంచి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం రాజయ్యపేటకు చేరుకుంటారు. మధ్యాహ్నం 3:40 గంటలకు ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను సందర్శించి, ఏఎంఎన్ఎస్ ఇండియా స్టీల్ ప్లాంట్ నమూనాను పరిశీలిస్తారు. అనంతరం కేంద్ర మంత్రులతో కలిసి శంకుస్థాపన ఫలకాన్ని ఆవిష్కరించి, అవగాహన ఒప్పందాల కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం ముగిశాక తిరిగి అమరావతికి పయనమవుతారు.

ఈ భూమిపూజ కార్యక్రమానికి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేశ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు అనిత, టి.జి. భరత్, ఎంపీ సి.ఎం. రమేశ్ సహా పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. ఆర్సెలర్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఇండియా చైర్మన్ ఆదిత్య మిట్టల్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

## ఇరాన్ అధ్యక్షుడికి మరోసారి ప్రధాని మోదీ ఫోన్..

### పశ్చిమాసియా యుద్ధంపై కీలక చర్చ

అంతర్జాతీయ వాణిజ్యానికి జీవనాడి అయిన నౌకాయాన స్వేచ్ఛకు ఎలాంటి ఆటంకం కలగకూడదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా, హర్మూజ్ జలసంధి వంటి కీలకమైన షిప్పింగ్ మార్గాలు ఎల్లప్పుడూ తెరిచి ఉండి, సురక్షితంగా ఉండాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు.

ఇరాన్‌లో నివసిస్తున్న భారతీయ పౌరుల భద్రత, సంక్షేమానికి ఇరాన్ ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి ప్రధాని మోదీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో తమ పౌరుల భద్రతకు భారత్ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్న సందేశాన్ని ఇది పరోక్షంగా తెలియజేసింది. పశ్చిమాసియాలో శాంతి, సుస్థిరతలను నెలకొల్పేందుకు భారత్ చేస్తున్న దౌత్య ప్రయత్నాల్లో ఇదొక ముఖ్యమైన ముందడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు. వివాదాల పరిష్కారానికి చర్చలే సరైన మార్గమని భారత్ మరోసారి తన వైఖరిని స్పష్టం చేసినట్లయింది.

ఇదిలా ఉండగా, మార్చి 12న జరిగిన తొలి ఫోన్ సంభాషణలో కూడా ప్రధాని మోదీ పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, పౌరుల మరణాలు, మౌలిక సదుపాయాల విధ్వంసంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని సమస్యలను చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలన్నది భారత్ స్థిరమైన వైఖరి అని ఆయన స్పష్టం చేశారు. సరుకు రవాణా, ఇంధన సరఫరాకు ఆటంకాలు ఏర్పడితే భారత ఆర్థిక వ్యవస్థపై, ప్రాంతీయ స్థిరత్వంపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు.

## ఇంధన వనరులపై దాడుల్ని ఖండించిన మోదీ

ప్రధానమంత్రి మోదీ బహ్రెయిన్ రాజుతో జరిపిన టెలిఫోన్ సంభాషణలో నొక్కిచెప్పారు. "బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఈసా అల్ ఖలీఫాతో మాట్లాడాను. ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా ఆయనకు, బహ్రెయిన్ ప్రజానీకానికి హార్దిక అభినందనలు తెలియజేశాను. మేమిద్దరం పశ్చిమాసియా పరిస్థితిపై చర్చించుకున్నాం. ఇంధన వనరులపై, పౌరుల మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులు ప్రపంచ ఆహార, ఇంధన భద్రతపై, ఎరువుల సరఫరాపై ప్రతికూల ప్రభావం చూపుతాయన్న అభిప్రాయంతో ఇరువురం ఏకీభవించాం" అని మోదీ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. బహ్రెయిన్‌లోని భారతీయ సంతతికి మద్దతు, సహాయ సహకారాలు అందిస్తున్నందుకు ఆ దేశాధినేతకు కృతజ్ఞతలు తెలియజేసినట్టు మోదీ చెప్పారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు దాడులు ప్రారంభించిన నాటి నుంచీ మోదీ బహ్రెయిన్ రాజుతో మాట్లాడటం ఇది రెండోసారి.

## తితిదే ఆలయాలను అధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి

గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించిన సమయం నుంచి శ్రీవారి దర్శనం పూర్తి చేసుకొని తిరుగుప్రయాణం అయ్యే వరకు వారికి అందుతున్న సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు.

తిరుమల పవిత్రతకు భంగం కలిగించే చర్యలను అరికట్టేందుకు అత్యాధునిక సీసీ కెమెరాలు, ఫేస్ రికగ్నిషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తిరుమలలో ఇప్పటికే ఈ వ్యవస్థను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. తిరుమలలో భవిష్యత్తులోనూ కాలుష్యానికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మరిన్ని ఆలయాల నిర్మాణం ద్వారా భక్తి భావాన్ని పెంపొందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం పేర్కొన్నారు. అన్నదానం, ప్రాణదాన టస్టు సేవలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, ప్రాణదానం ట్రస్టు సేవలను విస్తరించి మెరుగైన వైద్య సేవలు అందించాలని సీఎం సూచించారు. శ్రీవారి సేవలో పాల్గొనే సేవకులకు వారి నైపుణ్యానికి తగ్గట్టుగా శిక్షణ ఇచ్చి, వారి సేవలను తితిదే పరిధిలోని అన్ని ఆలయాల్లో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తితిదేలో అమలు చేస్తున్న విధానాలు దేశంలోని ఇతర ఆలయాలకు మార్గదర్శకాలుగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా క్యూలైన్ మేనేజ్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలన్నారు.

## పీఎస్‌యూ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 62కి పెంపు.. సానుకూలంగా ప్రభుత్వం!

విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, పురపాలక శాఖ మంత్రి నారాయణలతో కూడిన కమిటీ ఇప్పటికే సమావేశమైంది. పదవీ విరమణ వయసు పెంపునకు ఈ కమిటీ సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. ఈ నిర్ణయం అమలైతే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8,500 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది.ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, 9, 10 షెడ్యూల్ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు డిమాండ్ చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రతిపాదనలు ముందుకు సాగలేదు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ అంశంపై దృష్టి సారించి, మంత్రులతో సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. వయసు పెంపు వల్ల ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం వంటి అంశాలను కూడా కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి, ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.కేబినెట్ సబ్ కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

## ఆధునిక యుద్ధం..సరిహద్దులు దాటింది: రాజ్‌నాథ్ సింగ్

పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని సైనిక పాఠశాల ఆవిర్భావ దినోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్న రాజ్‌నాథ్ మాట్లాడుతూ..ఈ వ్యాఖ్యలు చేశారు.ఆధునిక యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా దేశంలో ఆయుధ సంపత్తిని అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. అందులో భాగంగానే సాయుధ దళాలకు అధునాతన, స్వదేశీ ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దేశ రక్షణలో యువత కూడా తమ వంతు పాత్ర పోషించాలని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఎటువంటి సమస్యనైనా ఎదుర్కోగలిగేలా క్రమశిక్షణ, మానసిక దృఢత్వం పెంపొందించుకోవాలన్నారు. సైన్యం, పౌరులు బలంగా ఉన్నప్పుడే దేశం ముందడుగు వేస్తుందన్నారు.

**ఎన్‌సీసీలో ప్రవేశాల సామర్థ్యం పెంపు**

దేశ రక్షణలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ)లో ప్రవేశాల సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గతంలో 17 లక్షలుగా ఉన్న నియామకాలను 20 లక్షలకు పెంచుతున్నట్లు తెలిపారు. అంతే కాకుండా ప్రజా-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) నమూనాలో దేశవ్యాప్తంగా 100 కొత్త సైనిక పాఠశాలలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**'నారీ శక్తి'కి ఊతం**

సైనిక పాఠశాలల్లో బాలికలు ఎక్కువ సంఖ్యలో చేరుతుండడాన్ని చరిత్రాత్మకమైన ముందడుగు అని అభివర్ణించారు. ఈ నిర్ణయం దేశ 'నారీ శక్తి'ని మరింత బలోపేతం చేస్తోందన్నారు. బాలికా క్యాడెట్లు తమ సామర్థ్యాలను నిరంతరం నిరూపించుకుంటున్నారని, వివిధ రంగాలలో భవిష్యత్ నాయకులుగా ఎదుగుతారని ఆకాంక్షించారు.

# ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

### బొమ్మన సుబ్బరాయుడుకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కమిటీ సభ్యులు








(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మార్చి 21)

బద్వేల్ మున్సిపాలిటీ పరిధి లక్ష్మీపాలెంలో వెలిసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం తెల్లవారుజామున స్వామివారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకం కుంకుమార్చన తో పాటు పలు రకాల విషయ పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండి పట్టణ పరిసర ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో భక్తాదులందరూ తరలివచ్చి ఆలయ ప్రదక్షిణలు చేపట్టి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని కాయ కర్పూరం సమర్పించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ దేవదర్శక ఈవో మరియు కమిటీ సభ్యులు ప్రత్యేక తీర్థప్రసాదాలను అందజేశారు. అలాగే శనివారం ఉదయం బిజెపి జిల్లా పార్లమెంట్ కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు మాజీ నీటి సంఘం అధ్యక్షులు ఒంటె పీరయ్య, ధర్మకర్త యం సుబ్బయ్య, బీనా గోపాలకృష్ణ, వేద పండితులు భరద్వాజ్, శ్రావణ్ సాధరంగా ఆహ్వానం పలికి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి వస్త్రం, పూలమాలతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం బొమ్మన సుబ్బరాయుడు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం చాలా సంతోషకరమని వారన్నారు. గ్రామ ప్రజలు పలువురు దాతల సహకారంతో బ్రహ్మోత్సవాలను వైభవంగా జరపడం వలన వారు వేద పండితులకు, కమిటీ సభ్యులకు ప్రత్యేకంగా వారిని అభినందించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా భక్తులందరూ తిలకించేందుకు సోషల్ మీడియాలో ప్రతిరోజు పోస్ట్ చేస్తున్న గణేస్‌ను బొమ్మన సుబ్బరాయుడు చేతుల మీదగా శాలువతో సత్కరించి వారిని అభినందించారు. రాష్ట్ర ప్రజలందరికీ కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి కరుణ కటాక్షాలు ఉండాలని వారు ఆకాంక్షించారు. బొమ్మన సుబ్బరాయుడు వెంట 6టీవీ రిపోర్టర్ ఆవులేటి శేఖర్ రాయల్, వార్త జర్నలిస్ట్ వల్లంకొండు వెంకటరమణ, పలువురు భక్తులు, గ్రామ ప్రజలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ప్రకాశం

మార్కాపురం

బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

22.03.26    ఆదివారం


# ఆటోలో మర్చిపోయిన సూట్‌కేస్‌ను ప్రయాణికుడికి అప్పగించి నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 21)
ఒంగోలు రైల్వే స్టేషన్ సమీపంలోని ఆటో స్టాండ్‌లో ఒక ప్రయాణికుడు ఆటో ఎక్కి, ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ గేట్ వరకు ప్రయాణించి అక్కడ దిగాడు. అయితే అతను తన సూట్‌కేస్‌ను ఆటోలోనే మర్చిపోయి వెళ్లిపోయాడు. కొంత సేపటికి తన సూట్‌కేస్ కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన ప్రయాణికుడు వెంటనే ట్రాఫిక్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ విషయాన్ని అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్‌రావుకి తెలియజేశారు. వెంటనే స్పందించి ప్రయాణికుడిని తన మోటార్ సైకిల్ పై తీసుకుని రైల్వే స్టేషన్ ఆటో స్టాండ్‌కు చేరుకున్నారు. అక్కడ ఉన్న ఆటో డ్రైవర్లను విచారించగా, ఒక ఆటో డ్రైవర్ తన ఆటోలో సూట్‌కేస్ ఉందని, అది ప్రయాణికుడు మర్చిపోయిందని నిజాయితీగా ఆ డ్రైవర్ సూట్‌కేస్‌ను ట్రాఫిక్ ఎస్ఐకి, రైల్వే స్టేషన్ వద్ద విధులు నిర్వహిస్తున్న హెచ్‌జీ యాదలింగంకు అప్పగించారు. అనంతరం ట్రాఫిక్ ఎస్ఐ సూట్‌కేస్‌ను పరిశీలించి, అందులోని వస్తువులు అన్ని ఉన్నాయని నిర్ధారించుకుని ప్రయాణికుడికి అందజేశారు. తన సూట్‌కేస్ తిరిగి పొందిన ప్రయాణికుడు పోలీసులకు, ఆటో డ్రైవర్ నిజాయితీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ జగదీష్ పోలీస్ సిబ్బందిని, ఆటో డ్రైవర్‌ను అభినందిస్తూ, ఇలాంటి నిజాయితీ పనులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ప్రజలు తమ వస్తువుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

# జిల్లాలో 5,377 గ్యాస్ సిలిండర్లు



- ప్రజలకు అందుబాటులో ఉన్నాయి - జిల్లాలో గ్యాస్ కొరత లేదు

గ్యాస్‌కు సంబంధించి వివరాలు తెలుసుకునేందుకు కంట్రోల్ రూమ్ నెం.9493247765 - డిఎస్ఓ జమీర్ బాషా

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మార్చి 21)
ప్రభుత్వం నిర్ణయించి ధర కంటే గ్యాస్ సిలిండర్లు ఎక్కువగా వసూలు చేస్తున్న అట్టి గ్యాస్ ఏజెన్సీల పై నిత్యావసరాల చట్టం 1955, ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఆర్ జమీర్ భాష శనివారం ఒక తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్లు బరువు తగ్గిన, అధిక ధరలకు అమ్మిన అట్టి గ్యాస్ ఏజెన్సీల పై నిత్యావసరాల చట్టం 1955, ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని 27 గ్యాస్ ఏజెన్సీలకు సంబంధించి 5377 గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని గ్యాస్ ఏజెన్సీ లను సిఎస్ డిటీలు తహశీల్దార్లు తనిఖీ చేయడం జరుగుతున్నదని తెలిపారు. జిల్లా కలెక్టరేట్, డివిజనల్ స్థాయిలో కంట్రోల్ రూములను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అసత్య ప్రచారాలు నమ్మి వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వినియోగదారుల అవసరాలకు తగిన విధంగా యల్.పి.జి. గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉండేలా పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. గ్యాస్ కంపెనీల ద్వారా సరఫరా సాధారణంగానే కొనసాగుతుందని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్యాస్ కొరత వస్తుందనే ఉద్దేశంతో వెంట వెంటనే ఆన్లైన్లో గ్యాస్ బుకింగ్ చేయడానికి వెబ్ పోర్టల్ అనుమతించదని కేవలం పట్టణాలలో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాలలో45 రోజులు తర్వాత మాత్రమే గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని బుక్ చేసిన తర్వాత 7 రోజులలోగా సిలిండర్ వస్తున్నదన్నారు. గృహ అవసరాలు, సంక్షేమ వసతి గృహాలు మరియు ఇతర అత్యవసర సేవలకు గ్యాస్ సరఫరాలో నిలుపుదల ఉండదని స్పష్టం చేశారు. అవసరానికి మించి గ్యాస్ సిలిండర్ల ను నిల్వ చేయడం లేదా కొనుగోలు చేయడం చేయరాదన్నారు. ప్రభుత్వం మరియు జిల్లా పాలన యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తున్నాయన్నారు. ప్రజలు అపోహలను నమ్మకుండా అధికారిక సమాచారం

## హాస్పిటల్ వద్ద మృతుడి కుటుంబ సభ్యులు రాస్తారోకం
## న్యాయం చేయాలంటూ ఆందోళన
## మార్కాపురం మండలం ఇడుపూరుకు చెందిన రైతు మల్లయ్య అనుమానాస్పద స్థితిలో మృతి

ఆవులను మేతకు తీసుకెళ్లిన మల్లయ్య చెట్టుకు వేలాడుతూ కనిపించిన వైనం

మృతుడి తల వెనుక గాయం ఉండడంతో హత్యే అని కుటుంబ సభ్యుల ఆరోపణ

# ఆత్మహత్య కాదు.... ఇది హత్య...!

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మార్చి 21)
టీడీపీకి చెందిన ఓ రియాల్టర్ ఉచ్చులో చిక్కుకుని ఆరేళ్లుగా నలిగిపోయిన ఓ రైతు చెట్టుకు వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. మృతి చెందిన రైతు కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల మేరక మార్కాపురం మండలం ఇడుపూరు గ్రామానికి చెందిన సంకుల అంకాలయ్య కుమారుడు మల్లయ్య (49) శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆవులను మేత కోసం పొలానికి తీసుకెళ్లాడు. సరిగ్గా అరగంట తర్వాత ఊరి శివారులో చెట్టుకు ఉరేసుకున్నట్లు స్థానికులు సమాచారం అందించారు. మృతుడి తల వెనుక భాగంలో గాయం ఉండడంతో చంపేసి, వేలాడదీశారని బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

భూ వివాదంతోనే హత్య....భూమి వ్యవహారం పై వివాదం తలెత్తిన నేపథ్యంలోనే హత్యకు పాల్పడ్డారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తు న్నారు. మల్లయ్య తన 4 ఎకరాల భూమిని మార్కాపురం పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు దూదేకుల మస్తానయ్యకు ఆరేళ్ల క్రితం విక్రయించేందుకు అడ్వాన్సు తీసుకుని అగ్రిమెంటు ఇచ్చాడు. స్వాధీన అగ్రిమెంట్ చేసుకోక ముందే ఆ భూమిలో మట్టి తవ్వ కాలు చేపట్టడంతో ఇరువురి మధ్య విభేదాలు తలెత్తాయి. మట్టి తవ్వకుండా ఉండాలంటే తన అడ్వాన్స్ డబ్బు తిరిగి ఇచ్చేయాలని మస్తాన్ ఫోన్లో బెదిరించాడని మల్లయ్య కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే విష యమై గతం లో రూరల్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా "ఇది సివిల్ వివాదం..

(తరువాయి 4లో...)



# ఆ ఎమ్మార్వో...కాసుల బేరం



రైటప్ సస్పెండ్ అయిన తహశీల్దార్ దిలీప్ కుమార్...

## భూముల పందేరం
## వందలాది ఎకరాలు అడ్డగోలుగా వెబ్ ల్యాండ్‌లో నమోదు
## అవినీతి అధికారులపై కొరడా
## జిల్లా కలెక్టర్ రాజాబాబు
## పెద్దారవీడు తహసీల్దార్ దిలీప్ కుమార్, దేవరాజుగట్టు వీఆర్వో విజయభాస్కర్‌రెడ్డి సస్పెన్షన్

(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, మార్చి 21)
భూముల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడిన మార్కాపురం జిల్లా పెద్దారవీడు తాసిల్దార్ బి దిలీప్ కుమార్, దేవరాజు గట్టు వీఆర్ఓ ఎన్ విజయభాస్కర్ రెడ్డిలను సస్పెండ్ చేసినట్లు మార్కాపురం ఇన్చార్జి కలెక్టర్ పి రాజబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దారవీడు తాసిల్దార్ బి దిలీప్ కుమార్ మెడికల్ లీవ్ లో ఉండి 30 కి పైగా మ్యుటేషన్ లు ఆన్లైన్ చేశారని వివరించారు. వీటిలో 25 కు పైగా నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి ఆధారాలు లేకుండా చేశారన్నారు. వీటిలో 19 మ్యుటేషన్లు దేవరాజు గట్టు గ్రామానికి చెందినవి కావడం విశేషం. భూముల అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్చార్జి కలెక్టర్ రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. భూములకు సంబంధించి ఎలాంటి డాక్యుమెంట్స్ లేకుండా కేవలం డబ్బుల కోసమే కొటేషన్లు చేసి ఒకరి భూములు ఒకరికి ఎక్కించటంలో ఆ ఎమ్మార్వో దిట్ట. గతంలో కూడా ఇదే మాదిరిగా అక్రమ భూముల వ్యవహారంలో సస్పెండ్ అయ్యారు. గత కొన్ని వారాల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో ఉండి మోటేషన్లకు ఫింగర్ ప్రింట్ వేయటం గమనార్హకం. మండలంలో తోకపల్లి, గొబ్బూరు, ఇతర గ్రామాలలో ఇదే వ్యవహార శైలి జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. జిల్లా కలెక్టర్ తగు చర్యలు తీసుకొని ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



రైటప్ సస్పెండ్ అయిన దేవరాజుగట్టు వీఆర్ఓ విజయభాస్కర్‌రెడ్డి

# పాత ముద్దాయిలకు కౌన్సిలింగ్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 21)

ప్రకాశం జిల్లా పోలీస్ శాఖ గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, విక్రయాన్ని నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఒంగోలు పట్టణంలోని మహిళా పోలీస్ స్టేషన్ సీఐ యు సుధాకర్ నేతృత్వంలో ఎస్ఐ సుదర్శన్, స్పెషల్ పార్టీ సిబ్బంది కలిసి గతంలో గంజాయి వినియోగం, విక్రయానికి సంబంధించిన కేసుల్లో నిందితులుగా ఉన్న ఒంగోలు పట్టణానికి చెందిన వారికి సీఐ సుధాకర్ కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్ సందర్భంగా గంజాయి, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, చట్టపరమైన పరిణామాలు, కుటుంబం, సామాజిక జీవనం పై ప్రభావాలను వివరించారు. ఇలాంటి కార్యకలాపాలను అణచి వేసేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని, ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల వినియోగం లేదా విక్రయం చేపడుతున్నట్లు గమనించినట్లయితే, వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112 ద్వారా సమాచారం అందించాలని అధికారులు కోరారు.

# ఆత్మహత్య కాదు.... ఇది హత్య...!



తాము జోక్యం చేసుకో లేం" అని చెప్పారన్నారు. ఇది ఆత్మహత్య కాదు.. హత్యే అని కన్నీటి పర్యంతమయ్యారు. రూరల్ ఎస్ఐ వేమన మల్లయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జీజీహెచ్‌కు శనివారం తరలించారు. జిహెచ్ఎం హాస్పిటల్ వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు ధర్నా నిర్వహించారు. అనంతరం డీఎస్పీ నాగరాజు ఘటనా స్థలానికి చేరుకొని మృతుడు కుటుంబానికి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమనిగింది. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ వేమన తెలిపారు.

# జిల్లాలో 5,377 గ్యాస్ సిలిండర్లు

మాత్రమే విశ్వసించాలన్నారు. గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లను (14.21 కిలోలు) వాణిజ్య అవసరాల కోసం తరలించిన, వినియోగించిన అట్టి వారి పై నిత్యావసరాల చట్టం 1955, ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

# చలివేంద్రంను ప్రారంభించిన ఎమ్మెల్యే తాటిపర్తి



(షణ్ముఖ వెలుగు, దోర్నాల, మార్చి 21)

మండల పాస్టర్స్, ఇవాంజెలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యే వై.ఎస్.ఆర్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ప్రారంభించారు. దోర్నాల మండల పాస్టర్స్, ఇవాంజెలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దోర్నాల నటరాజ్ సెంటర్లో గల డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి అనంతరం ఆవరణములో ఏర్పాటుచేసిన చలివేంద్రమును ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యే, వైయస్సార్సీపి రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాస్టర్స్ యూనియన్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ వేసవికాలంలో ఎండలు చాలా తీవ్రంగా ఉన్న పరిస్థితులలో పాస్టర్స్ యొక్క మంచి ఆలోచన ద్వారా చలివేంద్రం ఏర్పాటు చేయడం చాలా అభినందనీయమని పాస్టర్స్ సేవా మార్గాన్ని ఎన్నుకొని, సామాజిక



కార్యక్రమాలు చేయడం చాలా సంతోషంగా ఉందని తెలియజేసి దోర్నాల మండల పాస్టర్స్ యూనియన్ సభ్యులందరికీ అభినందించారు. ఈ కార్యక్రమంలో దోర్నాల వైసిపి మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, దోర్నాల మండల ఎంపీపీ గుమ్మా పద్మజ ఎల్లేష్, ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి సింగా ప్రసాద్, పాస్టర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు రెవరెండ్ సింగా యేసుదానం, వైస్ ప్రెసిడెంట్ చాట్ల ఇర్మియా, జనరల్ సెక్రెటరీ పాస్టర్ మేడిపల్లి అశోక్ కుమార్, జాయింట్ సెక్రెటరీ బరిగల జాన్ ప్రసాద్‌రావు, ట్రెజరర్ రెవరెండ్ యలకపాటి రంజిత్ రాజ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ రెవరెండ్ దుండి డేవిడ్ రాజ్, సింగా సురేష్ బాబు, చాట్ల రాజు, గౌరవ సలహాదారులు రెవరెండ్ కాసిమల్ల రూబెన్, రెవరెండ్ పూర్ణకంటి జేమ్స్, రెవరెండ్ యలకపాటి ప్రేమన్న, ఎర్రగొండపాలెం నియోజకవర్గ జనరల్ సెక్రటరీ చాట్ల గంగయ్య, సెంట్రల్ చర్చ్ ఆఫ్ క్రైస్ట్ డైరెక్టర్ సింగా రాజేష్, గోన లివింగ్ స్టోన్, కోడి శ్రీను, వైసిపి మండల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది. పాస్టర్స్ యూనియన్ ప్రెసిడెంట్ బుట్టి పాల్ స్పర్జన్ మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్, మే మాసాలలో ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉండటం వలన ప్రజల దాహార్తి తీర్చుటకు పాస్టర్స్ యూనియన్‌లోని కమిటీ పెద్దలు, సభ్యులతో మాట్లాడి నాయకుల సమక్షంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు.



# మండలంలో ఘనంగా రంజాన్ సంబరాలు

## ఈద్గాల వద్ద భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, మార్చి 21)

మండలంలోని తర్లుపాడు, తుమ్మలచెరువు, మీర్జాపేట, చెన్నారెడ్డిపల్లి, తదితర గ్రామాలలో రంజాన్ (ఈద్–ఉల్–ఫితర్) పర్వదినవేడుకలు అత్యంత వైభవంగా ఘనంగా భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకున్నారు. సుమారు 40 రోజుల పాటు నియమనిష్టలతో ఉపవాస దీక్షలు పాటించిన ముస్లిం సోదరులు శనివారం పండుగను చిన్న,పెద్ద,పేద, ధనిక, అనే భేదభావం లేకుండా, పేదవారికి దాన ధర్మాలు చేసుకుంటూ ఎంతో ప్రేమానురాగాలతో ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ వేడుకలు ఘనంగా మండలంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయాన్నే ముస్లిం సోదరులందరూ కొత్తబట్టలు ధరించి, గ్రామంలోని ప్రధాన వీధుల గుండా "అల్లా హు అక్బర్" అంటూ ప్రార్థన మందిరం(మస్జిద్) నుండి పురవీధుల గుండా నినాదాలు చేస్తూ గ్రామ శివారులలో ఉన్న ఈద్గా వరకు భారీ ర్యాలీగా తరలివెళ్లారు. తర్లుపాడు మసీదు ఇమామ్ అబ్దుల్ రహీమ్ ఆధ్వర్యంలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. లోక కళ్యాణం కోసం, అందరూ సుఖసంతోషాలతో ఎల్లవేళలా ఉండాలని ఈ సందర్భంగా దువా చేశారు. ప్రార్థనల అనంతరం ముస్లింసోదరులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. అలాగే మీర్జా పేట గ్రామ సర్పంచ్ దుర్భసుల వీరయ్య ( పుల్లయ్య) ముస్లిం సోదరుల ఆహ్వానం మేరకు గ్రామ టిడిపి నాయకులు కూచిపూడి రోశప్పనాయుడు, గుర్రపుశాల నరసింహారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజారపు నాగతిరుపతయ్య, పసలు వెంకటేశ్వర్లు, ఆర్ గురవయ్య, ఆర్ తిరుపతయ్య, ఆర్ వెంకటేష్, కుర్ర నాగరాజు, నాలి ఎల్లయ్య, మాదాల వెంకటేశ్వర్లు, దండు రంగసాయి, దుర్బెసుల మల్లయ్య, పీర్ల సుభాని, డి చిన్న మీరయ్య, డి నన్నయ్య, దూదేకుల అటేల్సాహెబ్, పూసలపాటి సిద్దయ్య, డి రఫీ, ఖాదర్ వలి, షేక్షావలి, మస్తాన్వలి, బాజీ బాబా శ్రీలను, కొందరు టిడిపి నాయకులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈద్గా వద్ద టిడిపి నాయకుడు రోశప్ప నాయుడు తో ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేపించి వారందరి ఐక్యతను ఒకరినొకరు ప్రేమపూర్వకంగా, స్నేహసంబంధాలను చాటుకున్నారు.











# సురక్షిత ప్రయాణం లక్ష్యంగా హెడ్‌లైట్ల పై ప్రత్యేక డ్రైవ్

## రోడ్డు భద్రత నిబంధనలకు విరుద్ధంగా వాహనాలకు అమర్చిన హెడ్ లైట్లను తొలగింపు చర్యలు చేపట్టిన పోలీసులు

## స్వచ్ఛందంగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా అమర్చిన హెడ్ లైట్స్ తొలగించుకోవాలని వాహన చోదకులు పిలుపు

## జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 21)**

రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డుభద్రత, ట్రాఫిక్ నియమాల అమలును పటిష్టం చేయడానికి జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఒంగోలు టౌన్‌లో ట్రాఫిక్ సిఐ జగదీష్, ఎస్ఐలు, వారి సిబ్బంది కలిసి మోటార్ సైకిళ్లు, ఆటోలు, కార్లపై అనధికారికంగా అమర్చిన లైట్లను గుర్తించి తొలగించారు. అనుమతి లేకుండా అధిక కాంతి వెలువరించే లైట్లు లేదా ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా అమర్చడం ప్రమాదాలకు దారితీస్తుందని, ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ లైట్లు ఎదురుగా వచ్చే వాహనదారుల దృష్టిని ప్రభావితం చేసి ప్రమాదాలకు దారితీసే దారి తీసే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా ఒంగోలు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ జగదీష్ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తూ, ప్రభుత్వం అనుమతించిన ప్రమాణాలకు అనుగుణంగా మాత్రమే లైట్లు ఉపయోగించాలని సూచించారు. ట్రాఫిక్ భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, పోలీసులు చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని కోరారు. వాహనదారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇలాంటి లైట్లను తొలగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఉల్లంఘనలు గుర్తించిన వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని, సురక్షిత రహదారి వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు.





# కంభం పోలీసుల మంచి మనసు ఈద్‌గాహ్‌లో సోదరభావానికి నిదర్శనంగా సీఐ, ఎస్ఐ సేవలు



**(షణ్ముఖ వెలుగు, కంభం, మార్చి 21)**

కంభం పట్టణంలోని ఈద్‌గాహ్‌లో రంజాన్ పర్వదిన నమాజ్ కార్యక్రమం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా, భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడింది. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు కంభం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున ఆధ్వర్యంలో ఎస్సై శివకృష్ణారెడ్డి, పోలీసు సిబ్బంది కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాదిమంది ముస్లిం సోదరులు ఈద్‌గాహ్‌కు చేరుకుని నమాజ్‌లో పాల్గొన్నారు. ఎలాంటి రద్దీ, ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, ప్రజల రాకపోకలపై ప్రత్యేక దృష్టి సారించారు. మహిళలు, వృద్ధులు సౌకర్యంగా నమాజ్‌లో పాల్గొనేలా తగిన ఏర్పాట్లు చేశారు. నమాజ్ అనంతరం పోలీసుల మంచి మనసు ప్రతిబింబించేలా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, ఎస్సై శివకృష్ణారెడ్డి స్వయంగా ముందుండి ముస్లిం సోదరులకు జ్యూస్ మరియు డ్రై ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ చర్యతో పోలీసుల పై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగింది. సోదరభావాన్ని పెంపొందించే ఈ కార్యక్రమం అందరి ప్రశంసలు అందుకుంది. అదేవిధంగా జిల్లా ఎస్పీ మార్కాపురం పోలీసుల తరపున రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ శాంతి, సామరస్యాన్ని కాపాడుకోవాలని కోరారు. పోలీసు శాఖ సమర్థవంతమైన భద్రతా చర్యలతో పాటు మానవత్వాన్ని చాటిచెప్పిన ఈ కార్యక్రమం స్థానిక ప్రజలను ఆకట్టుకుంది. మత పెద్దలు, ప్రజలు పోలీసు అధికారులను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.





# ఘనంగా రంజాన్ వేడుకలు



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మార్చి 21)**

మండలంలో ముస్లిం సోదరులు శనివారం రంజాన్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో ఈద్గాల వద్ద ప్రత్యేక సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఆప్యాయంగా ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. భక్తి శ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ ముస్లిం లకు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. ఒక నెల పాటు రంజాన్ ఉపవాసం చేసిన అనంతరం, నెలవంక దర్శనంతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అల్లాకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, గురువులు, యవకులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవం జయప్రదం చేయండి



**(షణ్ముఖ వెలుగు, కంభం, మార్చి 21)**

ఏప్రిల్ 14వ తేదీన ప్రపంచ మేధావి, ఆధునిక భారత, పితామహుడు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 135 జయంతి ఉత్సవం ఘనంగా నిర్వహించుటకు పీపుల్స్ యాక్షన్ ఫోరం ఇండియా ఉపాధ్యక్షులు కొత్తపల్లి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవ కరపత్రం ఆవిష్కరించారు. ఈ జయంతి ఉత్సవమునకు ముఖ్య అతిథులుగా జాతీయస్థాయి మేధావులను ఆహ్వానించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు, ముఖ్యంగా యువత విరివిగా పాల్గొని జయప్రదం చేస్తారని బహుజన రాజ్య స్థాపనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు చిట్లూరి ఏలియా లార్డ్స్ స్వచ్ఛంద సేవ సంస్థ,కత్తి అనోజి రీడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ, దున్న యోబు( స్పీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ), ఆదిమూలపు, అనిల్ రాజు లూకా, సొసైటీ ఫర్ ఫాస్ట్ జస్టిస్, నంది నాగయ్య స్పాన్ స్వచ్ఛంద సేవా సంస్థ, ఎన్ ప్రభుదాస్, విశ్రాంత టీచర్, డాక్టర్ పూసలపాటి కేశవ్ పాల్, హదస్సా మినిస్ట్రీస్ స్థాపకులు కృపా శేఖర్, బహుజన పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు దాసరి యోబు, పీపుల్స్ యాక్షన్ ఫోరం ఇండియా నాయకులు బింగి బుజ్జి, మార్కాపురం జిల్లా ఇన్చార్జి వినుకొండ ప్రభాకర్, గిద్దలూరు నియోజకవర్గ ఇన్చార్జి జమ్మలమూడి అనిల్ కుమార్, కంభం మండల అధ్యక్షులు యద్దనపూడి నవీన్, అర్ధవీడు మండల అధ్యక్షులు, చాట్ల, పవన్, యువజన నాయకులు, కుంపటి, భాస్కర్, పివిపురం అధ్యక్షులు కువ్వారపు రాజేష్, యువజన నాయకులు, చాట్ల, స్కైలాబ్, కిరణ్ చాట్ల, ఇమ్మానియేలు, ఎదురూరు, పెద్ద రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రంజాన్ పర్వదిన వేడుకలు

**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మార్చి 21)**

మండలంలోని పొన్నలూరు, కే అగ్రహారం, భోగనంపాడు, మాలపాడు చెన్నిపాడు జెడ్ మేక పాడు గ్రామాలలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో పవిత్ర రంజాన్ పర్వదినాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. దీనిలో భాగంగా ఈద్గాల వద్దకు అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలువురు ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ప్రేమ సోదర భావం శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదినాన్ని జరుపుకొని మతసామరస్యాన్ని చాటుకోవటం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. 30 రోజులపాటు కటోర ఉపవాస దీక్షలు ఉండి అల్లా అనుగ్రహం పొందుతారని తెలిపారు.



# రంజాన్ పర్వదినాన ముస్లిం సోదరులతో కలిసి సామూహిక ప్రార్థనలో పాల్గొన్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మార్చి 21)
రంజాన్ పర్వదినం సందర్భంగా మార్కాపురం పట్టణంలోని పెద్ద నాగులవరం రోడ్లో ఉన్న ఈద్గా వద్ద మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ముస్లిం సోదరులతో కలిసి సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ తాను చిన్నప్పుడు నుంచి ముస్లిం సోదరుల మధ్య పెరిగానని అల్లాహ్ దయవల్ల మార్కాపురం జిల్లా వచ్చిందని జిల్లాతో పట్టణంలోని అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందుతారని త్వరలోనే అల్లాహ్ దయతో వెలుగొండ ప్రాజెక్టు కూడా పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని అన్నారు. ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా త్వరలో తయారు చేస్తామని తద్వారా ఈ ప్రాంతంలో పండ్ల పరిశ్రమ భారీగా వృద్ధి చెందుతుందని, ఫ్యాక్టరీలు వస్తాయని అన్ని రకాల పండ్లు ఈ ప్రాంతం లో విక్రయించేది అధిక సంఖ్యలో ముస్లింలైనని హార్టికల్చర్ హబ్ తో ముస్లిం మైనారిటీలు అభివృద్ధి చెందుతారని అన్నారు. అదేవిధంగా నిన్న వర్షంతో ఈ ఈద్గా ప్రాంతం కొంతమేర బురదమైనదని త్వరలోనే దీనికి శాశ్వత పరిష్కారం కోసం సంవత్సరానికి రెండు లక్షల రూపాయలతో మూడు సంవత్సరాల్లో ఆరు లక్షల రూపాయలు తన సొంత నిధులు వెచ్చించి ఈద్గా ప్రాంతంలో గ్రానైట్ బండలు పరచి శాశ్వత పరిష్కారం చూపిస్తానని ముస్లిం సోదరుల హర్షద్వానాల మధ్య ప్రకటించారు. ఈ సందర్భంగా మరొకసారి ముస్లిం సోదరులందరికీ ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేశారు.







# రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సీఐ, ఎస్ఐ

(షణ్ముఖ వెలుగు, కంభం, మార్చి 21)
కంభం సీఐ మల్లికార్జున, ఎస్ఐ శివ కృష్ణారెడ్డి కంభం మండలంలోని ముస్లిం సోదర సోదరీమణులకు పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ మాసం శాంతి, సహనం, దాతృత్వం మరియు సోదరభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం పెంపొందించాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆనందంగా, శాంతియుతంగా రంజాన్ పండుగను జరుపుకోవాలని కోరారు.








# కంభంలో చిన్నారుల ఖురాన్ ప్రతిభా ప్రదర్శన బహుమతులతో ప్రోత్సాహం

(షణ్ముఖ వెలుగు, కంభం, మార్చి 21)
మార్కాపురం జిల్లా కంభం మండలం అరఫత్ నగర్‌లోని మస్జీద్-ఎ-ముహమ్మదియాలో రంజాన్ నెల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం హర్షాతిరేకంగా జరిగింది. మస్జీదు అధ్యక్షులు షేక్ ఖాజావలి ఆధ్వర్యంలో చిన్నారులు ఈ పవిత్ర నెలలో నేర్చుకున్న ఖురాన్ సూరాలు, దుఆలను రంజాన్ చివరి రోజున తమ తల్లితండ్రుల సమక్షంలో వినిపించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఎక్కువ సూరాలు, దుఆలు నేర్చుకుని చెప్పిన చిన్నారులకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు ప్రదానం చేయగా, పాల్గొన్న ప్రతి చిన్నారికి కూడా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు షేక్ ఖాజావలి మాట్లాడుతూ, పిల్లలు ఇలాంటి ధార్మిక విద్యతో పాటు ఉన్నతమైన చదువులు నేర్చుకుని తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కర్నూలు జిల్లా నందికొట్కూరుకు చెందిన మౌలానా ఇస్మాయిల్ చిన్నారులకు ఖురాన్ సూరాలు, దుఆలు బోధించి వారిని ఈ స్థాయికి తీసుకువచ్చినందుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం భక్తి, ఆనందం, ప్రోత్సాహంతో నిండిన వాతావరణంలో విజయవంతంగా జరిగింది.







# చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మార్చి 21)

కందుకూరు పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద దాతలు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ప్రయాణికులు, పాదచారులకు ఎమ్మెల్యే స్వయంగా మజ్జిగ పంపిణీ చేశారు. గట్టమనేని సుశీలమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు శ్రీనివాస చౌదరి, పేముల అబ్రహం, దయావతమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అంతకుముందు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే నాగేశ్వరరావు, టిడిపి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పట్టణ మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బెజవాడ ప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీను, బిజెపి నాయకుడు ఉన్నం భాస్కర్, టీడీపీ నేతలు మద్రిపూడి శ్రీను, బత్తిన మాల్యాద్రి, పసుపులేటి రమణయ్య, కొత్తూరి వెంకట సుధాకర్, మురారి శెట్టి సుధీర్, శ్రీకాంత్, గుర్రం చిన్నఅల్లూరయ్య, చలివేంద్రం దాతలు గట్టమనేని శ్రీనివాస్ చౌదరి, పేముల అమృతవాణి, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.










# శ్రీగిరి శ్రీవారికి మేల్ చాట్ వస్త్రాల సమర్పణ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 21)

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి హైదరాబాద్ కు చెందిన రిత్విక్ మహా దేవ్,.శ్రావణి దంపతులు శని వారం మేల్ చాట్ వస్త్రాలను సమర్పించారు. ఆలయ అర్చకులు వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం చేయడంతో పాటు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి మేల్ చాట్ వస్త్రాలను సమర్పించిన రిత్విక్ మహా దేవ్ దంపతులను కుటుంబ సభ్యులను శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి , ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సీ వి రామకృష్ణారావు , ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి, తదితరులతో పాటు ఆలూరు జై శంకర్, తదితరులు అభినందించారు.



# ప్రార్థనా మందిరాలు, స్థలాల వద్ద పటిష్ట బందోబస్తు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 21)

ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది ప్రార్థనా మందిరాలు, స్థలాల వద్ద శనివారం పటిష్ట బందోబస్తు నిర్వహించారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు ప్రకాశం జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు తెలియచేశారు. ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ పర్వదినం పురస్కరించుకుని జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలలో భాగంగా మసీదులు, ప్రార్థనా మందిరాలు, స్థలాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. ముస్లిం సోదరుల ప్రార్థనలకు ఎలాంటి ఆటంకాలు, అవాంతరాలు జరుగకుండా బందోస్తు నిర్వహించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు. డ్రోన్ కెమెరాలతో కూడా నిఘా ఏర్పాటు చేశారు.







# భక్తి శ్రద్ధలతో రంజాన్

# ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 21)**

రంజాన్ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నెలరోజుల పాటు ఉపవాసాలు చేసిన ముస్లింలు తమ ప్రాంతాల్లోని మసీదుల్లో జరిగిన నమాజ్‌లో పాల్గొన్నారు. ఒంగోలులోని కొనిజేడు బస్టాండ్ వద్దగల ఈద్గాలో ఈద్ ఉల్ ఫితర్ నిర్వహించారు. ముస్లిం మత పెద్ద ఆబిద్ మౌలానా అల్లా మార్గాన్ని బోధించారు. విశ్వ మానవాళికి మహ్మద్ ప్రవక్త చెప్పిన హదీస్ గురించి బోధించారు. ప్రతి రోజూ సన్మార్గంలో నడవాలని బోధనలు చేశారు. ఈద్గాలో జరిగిన ఈద్ ఉల్ ఫితర్ లో ఐదు వేల మందికి పైగా ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఈద్గాలో జరిగిన ప్రత్యేక నమాజ్ కు ఐదు వేల మందికి పైగా ముస్లిం సోదరులు పాల్గొన్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసింది. ఒంగోలు డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వన్ టౌన్ సీఐ నాగరాజు, ట్రాఫిక్ సిఐ జగదీష్ భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఈద్గా ప్రాంత ఆవరణ చుట్టూ డ్రోన్ కెమెరాతో పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రశాంత వాతావరణంలో ఈద్ ఉల్ ఫితర్ జరిగేలా చూశారు.













## 28వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి సెపక్తక్రా ఛాంపియన్‌షిప్




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 21)**

28వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి సెపక్తక్రా ఛాంపియన్‌షిప్ ఈ నెల 23 నుండి 27 వరకు జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో నిర్వహించబడనున్నది. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బాలురు, బాలికల జట్టు పాల్గొననుంది. ఈ సందర్భంగా జట్టుకు సంబంధించిన క్రీడాకారులు గత ఐదు రోజులుగా ఒంగోలులోని డీఎస్సీ మినీ స్టేడియంలో శిక్షణ పొందుతున్నారు. కార్యక్రమంలో 21వ డివిజన్ అధ్యక్షులు మరియు ప్రకాశం జిల్లా సెపక్తక్రా అసోసియేషన్ నూతనంగా ఎన్నుకోబడిన చైర్మన్ గొల్లపూడి బాబురావు, ప్రెసిడెంట్ యనమల సురేష్ క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులతో మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతూ మరెన్నో విజయాలు సాధించాలని ఆశీర్వదించారు. అలాగే జిల్లా సెక్రటరీ మధు, ట్రెజరర్ రవి ప్రసాద్, కోచ్‌లు బి శ్రీనివాసులు, రంజిత్ క్రీడాకారులకు అభినందనలు తెలియజేసి, పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చేయాలని ఆకాంక్షించారు.



# ఆత్మీయ విందుకు హాజరైన ఎమ్మెల్యే నాగేశ్వరరావు

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మార్చి 21)**

రంజాన్ పండుగను పురస్కరించుకుని కందుకూరు పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి షేక్ సలాం ఇంట్లో శనివారం ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఇతర నాయకులు విందులో పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేకి సలాం కుటుంబ సభ్యులు స్వాగతం పలుకగా వారికి ఆయన రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ విందులో పెద్ద మసీదు ప్రెసిడెంట్ మొతిహార్, రియాజ్ మౌలానా, ఫైరోజ్ మౌలానా, యాసిన్ మౌలానా, నెల్లూరు పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ గారి పొర్యేషన్ చైర్మన్ చిలకపాటి మధు, ఏపీఈడబ్ల్యూఐడి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, తెలుగు యువత అధికార ప్రతినిధి బెజవాడ ప్రసాదు, నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీను, హలో టిడిపి నేతలు రాయపాటి శ్రీను, గోచిపాతల మోషే, వడ్డెళ్ళ రవిచంద్ర, చుండూరి శ్రీను, షేక్ సలాం, షేక్ ఖలీల్, నజీర్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.







On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com